

# వైశాల్యంలోని ఔదార్యం

అరువు ఇచ్చేవారు ఉంటే కొదవ ఏమిటి? ఈ అరువుతోటే ప్రపంచం నడుస్తోంది. దీన్ని గొప్పవాళ్లు పరపతి అంటారు. సామాన్యజనం అప్పు అంటారు. పేదవాళ్లు బిచ్చం అంటారు. అవన్నీ ఒక్కదానికే పర్యాయపదాలని మా రామం అంటాడు.

డబ్బు కరువు అయ్యేకొద్దీ ఖర్చు ఎక్కువ అవుతుంది. చోరవ ఎక్కువ. కొంద రంతే. ఎలాగూ మునుగుతున్నాం, ఇంకొంచెం మునిగితే ప్రమాదం ఏమిటిలే అంటారు. ప్రాణాధారమైన తైలం లేకపోయేసరికి అసలు ప్రాణంతోటే చెలగాటం ప్రారంభిస్తారు. అదే జూదం. వస్తే ఏమైనా రావాలి. లేకపోతే పోయేదేమీ లేదు. అంతే కాని ఏదో కష్టపడి కొంత సంపాదించి ఎలాగో ఈ షడ్యంత్రంలోంచి బయటపడదా మనుకోరు. అలాంటివాళ్ళతో వేగడం కష్టం.

వాళ్ళ జూదం కొంతకాలం సాగుతుంది. ఎప్పుడో ఇంక సాగకుండాపోయే స్థితి వస్తుంది. అప్పుడు కళ్ళు తేలవేస్తారు. ఏ కొంచెం అయినా పిరికితనం మిగిలిఉంటే పారిపోతారు. ఇంక అప్పటినుంచి పలాయనమంత్రమే జీవితానికి పట్టుగొమ్మ అవుతుంది.

అలా పారిపోయేవాళ్ళు కనిపిస్తూనే ఉంటారు. ఎప్పుడూ నాటకంలో పాత్ర నిర్వహించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. విఫలురు అవుతూనేఉంటారు. అదే ఆ నాటకంలో ప్రత్యేకత.

అరువు పుట్టినంతకాలం ఈ నాటకం సాగుతుంది. భోజనం అరువు. బట్టలు అరువు. సిగరెట్లు అరువు. సినీమా అరువు. కాఫీ అరువు. ఆఖరికి క్షౌరం కూడా అరువే. అసలు ఈ అరువు అంటూ కనిపెట్టిన మహాత్ముడు ఎవడో కాని, అతని పేర ఒక గొప్ప విగ్రహం శిలతోనో, కంచుతోనో, వెండితోనో, బంగారుతోనో, ఇంకా వీలు ఉంటే ఏ వజ్రాలతోనో అరువుపెట్టి చేయిస్తే బాగా ఉంటుంది.

మా రామానికి జట్కాబండి ఎప్పుడూ అరువే. పోనీ

అలా అని నలుగురితో కలిసి బండి ఎక్కేవాడా? ఎప్పుడూ లేదు. అది గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం. నామోషీ. అసహ్యం. అరువు ఎలా పుట్టించేవాడో నాకు తెలియదు కాని మొత్తంమీద ఎప్పుడూ దేనికీ కరువు లేకుండా కాలక్షేపం చేసేవాడు.

అసలు అరువు పుట్టించే శక్తి ఉండాలి కాని, రాళ్ళు కూడా పిండి డబ్బు వసూలు చేయవచ్చని నా మిత్రుడు సుబ్బారావు అంటూ ఉంటాడు. దానిలో నిజం ఉంది. మా రామంతో నాలుగు నిమిషాలు గడిపితే చాలు. అది అనుభవం లోకి వచ్చేస్తుంది.

రామం ఇప్పుడు సర్పవరంలో ఉన్నాడు. సర్పవరం కాకినాడకు చాలా దగ్గర. నరసింహం సెలవు తీసుకొని కాకినాడ వచ్చాడని తెలియగానే చూడడానికి బయలుదేరాడు రామం. డబ్బు లేకపోతే నడచి రావచ్చు. కాని నడిస్తే తలకొట్టేసి నట్లు అయిపోతుంది రామానికి. స్వంతంగా బండి చేసుకుని చక్కావచ్చాడు.

సాయంకాలం స్నేహితులం పెరట్లో పందిరి క్రింద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాము. రామం బండిలోంచి దిగాడు.

"తరువాత ఇస్తాలే, నరసయ్యా" అంటూ రామం బండి దిగి తడక ఒత్తిగించి ఆవరణలో అడుగు పెట్టబోయాడు.

"కాదు బాబయ్యా, ఈ వేళ అవసరమండి" అని బ్రతిమాలాడు బండి ఆసామి.

రామానికి కోపం వచ్చింది. ఎంత అరువు అయినా

పెట్టడానికి అనుమానించడు. కాని ఎవడుఅయినా డబ్బు అడిగితే రుద్రుడు అయిపోతాడు. అరువు వ్యాపారం అంటే అంతే. నిరాఘాటంగా శాశ్వతంగా సాగిపోవలసిన బాపతు వ్యాపారం అది. అరువు వ్యాపారానికి పరిష్కారంలేదు. దానికి అదే మూలసూత్రం. రామానికి కోపం వచ్చిందంటే ఆశ్చర్యం లేదు.

"తరువాత ఇస్తానన్నాగా" అని కసిరాడు.

"ఇంతకుముందు ఎప్పుడయినా నిక్కచ్చి చేశానండి? మీకు తెలియందేముంది? ఈ వేళ అవసరమండి" అన్నాడు నరసయ్య.

"ఏమిటా అవసరం?"

"గుర్రానికి దాణా కొనాలండి. అప్పుడే మూడు ట్రిప్పులు వేశానండి. దాణా వేయకపోతే గుర్రం బజ్జుంటుంది. మా చిన్నోడికి మందట్టుకెళ్ళాలండి."

"అలాంటివాడివి బండి ఎక్కకముందే చెప్పక పోయావ్?" గద్దించాడు రామం.

"ప్రభువులు, ఆగ్రహం వద్దండి. మీ దగ్గర ఆమాత్రం ఉండదా అనుకున్నానండి" అన్నాడు నరసయ్య.

డబ్బు లేదు. ఆ సంగతి పదిమందికీ తెలుసు. అయినా ఇతరులు భాగ్యవంతుడుగానే, గొప్పవాడుగానే చూడాలనుకుంటాడు మనిషి. మా రామంలాంటి మనిషి.

నరసయ్య అన్నమాటకి గుమ్మయిపోయాడు రామం. కోపం చాలావరకు తీరిపోయింది. కాని అసలంటూ డబ్బు అడిగాడన్న మంట ఇంకా ఉంది. ఇప్పటిమట్టుకు దాన్ని

అణుచుకోక తప్పదు. ఇంకా ఏమైనా కోపం తాపం చూపిస్తే మేము ఏమైనా అంటామేమోననే భయమూ ఉంది. కాని ఏం చేస్తాడు?

డబ్బు బండి ఆసామి ముఖాన కొడదామంటే లేదాయె. ఇవ్వకపోతే విడిచేలా లేడు నరసయ్య.

అంతవరకూ ఈ వీధి భాగవతం మౌనంగా తిలకిస్తూన్న మావంక తిరిగాడు రామం!

మాకు ఇదేమీ కొత్తకాదు. పూళ్ళు మారవచ్చు. బళ్లు మారవచ్చు. మనుషులు మారవచ్చు. మా రామం మాత్రం జట్కాబండికి అరువు పెట్టక మానడు. ఇది నిజం.

రామం నరసింహం కేసి చూచాడు. నరసింహం నావంక చూచాడు. లేచివెళ్ళి నరసయ్యకు అర్ధరూపాయి ఇచ్చాను. నరసయ్య అదోలా చూశాడు.

మా రామం నాకేసి చూచి, "మరో నాలుగణాలు ఇవ్వరా" అని ఆజ్ఞాపించాడు. ఇచ్చాను. నరసయ్య బండి తోలుకొని వెళ్ళిపోయాడు.

మామూలుగా సర్పవరంనుంచి కాకినాడకు అప్పట్లో రేటు అర్ధరూపాయి. రామం మరో నాలుగణాలు ఇచ్చి అరువు సంపాదిస్తున్నాడు. గొప్ప కొనుక్కుంటున్నాడు. మొత్తం బాకీ పెట్టినా ఆ నాలుగణాలకోసం బండి ఆసామీ అరువు ఒప్పుకుంటాడు కదా అనుకున్నా. ఆమాటే నరసింహంతో అన్నాను. నరసింహం నవ్వాడు.

"అసలు మంచితనం ఉండాలి కాని నాలుగు అణాల

కోసం, అణాకోసం అరువు ఇస్తార్రా, వెర్రికాని" అన్నాడు నరసింహం.

"నా పేరు చెపితే, వీడేమిటి, సర్పవరం, కాకినాడ, ఈ చుట్టుపల్లలో ఏ బండివాడు అయినా వస్తాడు. డబ్బు అడగడు" అన్నాడు రామం. దర్పానికి లోటు లేదు.

"అవును మరి. వెనుకటి బాకీ అయినా వసూలు అవుతుందేమోననే ఆశతో వాళ్లు ఇంకా అరువు ఇస్తూనే ఉంటారు" అన్నాడు నరసింహం. అంతా నవ్వుకొన్నాను.

"ఒక మాట అడుగుతా, నిజం చెప్పరా రామం. ఈ బండి ఆసామీకి పాత బాకీ ఏమైనా ఉందిరా" అన్నాడు నరసింహం.

'ఉ'ందన్నాడు రామం.

."ఎంతేమిటి?"

"రెండు దఫాలు కాకినాడ రాను పోను, ఒకసారి పిఠాపురం వెళ్ళడానికి ఇవ్వాలిరా."

"పాత స్నేహం అన్నమాట."

"అవును."

"ఎన్నాళ్ళనుంచి?"

"సర్పవరం వెళ్ళినప్పటినుంచి. రెండేళ్ళు కావస్తూంది. వెళ్ళిన వేళావిశేషం. ఆ వూరు వెళ్ళినప్పటినుంచి నరసయ్యే బండి కడుతున్నాడు."

"ఇదివరకు ఎప్పుడు అయినా డబ్బులకోసం నిల బెట్టాడా?"

"లేదు." మా రామం అబద్ధం ఆడడు. నేను అలా చెప్పితే మా వాడిని అవమానం చేసినట్లు అవుతుంది.

"అలాంటప్పుడు ఈ ఒక్కసారి—అందులోనూ ఏదో అవసరం వచ్చి అడిగితే కోపం ఎందుకురా" అని కొంచెం గట్టిగానే అడిగాడు నరసింహం.

"ఈమాట విను. అందరూ అర్ధ ఇస్తే నేను ముప్పావలా ఇస్తున్నాను. ఎప్పుడూ నాలుగణాలు ఎక్కువ ఇస్తూన్నానే కాని తక్కువ ముట్టచెప్పడం లేదు. ఆమాత్రం ఇది లేకుండా నిలబెడితే ఏమన్నమాట? ఉంటుంది, ఉండదు. ఇప్పుడంటే ఎవరో ఒకడు ఉండి ఇచ్చాడనుకో. లేకపోతే ఏంకాను? వాడు బజార్లో నిలువునా నా పరువు తీసేసునా? అది తప్పేనంటావా, కాదంటావా" అన్నాడు రామం.

"నేను కాకపోతే నా తాత ఇస్తాడు. నీకు అడ్డు పడడానికే ఈ ప్రపంచం అంతా. అడివిలో బండిదిగితే చెట్లు రాలుస్తాయిరా డబ్బులు, చెట్లు" అన్నాను.

"ఇంతకీ ఆ బండి ఆసామీ నీకు అరువూ ఉండాలి, కృతజ్ఞతా చూపా లంటావు. అంతేనా?" అన్నాడు నరసింహం.

"ఏం? ఆ మాత్రం ఉండక్కర్లేదూ" అని రెట్టించాడు రామం.

"నన్ను అడిగితే అక్కర్లేదంటాను. ఇంత కాలమూ అరువు ఉన్నందుకు, నువ్వు ఎప్పుడు ఇస్తే అప్పుడు తీసుకున్నందుకు, నీ మానం కాపాడినందుకు, నీ పౌరుషానికి భంగం కలగనివ్వనందుకు నువ్వే కృతజ్ఞత చూపాలి. మరోమాట. ఎప్పటి

డబ్బులు అప్పుడు పారేస్తే ఎక్కువ ఇచ్చినంత ఫలం. ఆలస్యం అయితే విలువ ఏముంది? ఆ మాత్రం అర్థం చేసుకోవాలి నువ్వు" అన్నాడు నరసింహం.

రామం మాట్లాడలేదు.

"ఒక బండి ఆసామీ గురించి, బండి కిరాయి గురించి ఇంత గొడవ ఎందుకు లేరా" అన్నాను నేను.

"ఇది గొడవ ఏమీ కాదు. ఒక్కసారి ఆలోచించడం మంచిదే. మనం ఏదో అర్థం చేసుకోగలిగినవాళ్ళం. బండి తోలుకునే ఆసామీకి అంత శక్తి లేదు. కనుక దాన్ని గురించి మాట్లాడుకోనడం అనవసరం అనుకోడం తప్పు" అన్నాడు నరసింహం.

నరసింహం కొంచెం ఆలోచనలో పడ్డాడు. మావాడి ఆలోచన చూడగానే పాత గాథ ఏదో త్రవ్వుతాడనిపించింది నాకు.

ఏ సంగతి చర్చకు వచ్చినా కొందరు తమ జీవితం అంతా నెమరువేసుకుని అలాంటిది ఏదో ఒకటి గుర్తుకు తెచ్చుకొంటారు. అది ఒక్కటే అయితే ప్రమాదం లేదు. కాని, స్వంత అనుభవాలు గురించి మాట్లాడడమంటే వాళ్ళకు సరదా. అలాంటి సరదా ఇతరులకు ఉండదని వాళ్లు అనుకోరు. కనీసం వినాలనే కుతూహలం అయినా ఉండదని అనుకోరు. ఒకవేళ తెలిసినా పట్టించుకోరు. తమ అనుభవం గురించి చెబుతారు. వినేదాకా విడిచిపెట్టరు. అన్ని విధాలా మంచి వాళ్ళు, స్నేహపాత్రులు అనుకునే మనుషులకు కూడా ఈ లోపం ఉంటుంది. మా నరసింహం ఈ కోవలోవాడు.

ఇంకో నిమిషానికి నా అనుమానం నిజం అయింది.

మా నరసింహం అన్నాడు:

"రామం ఔదార్యం గురించి చర్చిస్తూంటే వెనకటి సంగతి ఒకటి గుర్తుకు వచ్చింది. కొంచెం సేపు ఓపికపట్టి వినండిరా, చెబుతాను.

"అప్పుడు మా తాతయ్యసంరక్షణలో ఉన్నాను. తాతయ్యగారి ఊరు నడవపల్లి. మీకు తెలుసుకదా. ఉద్యోగ ప్రయత్నాలకోసం తరచుగా గోదావరి దాటుతూ ఉండే వాడిని. ఆ రోజుల్లో ప్రయాణం అంతా జట్కాలోనే. లేక పోతే పడవ.

"తాలూకాలో అమలాపురం, అనాతవరం, కాట్రేని కోన, ముమ్మిడివరం, ముక్తేశ్వరం ఘాట్లల్లో నన్ను ఎరగని జట్కావాలా లేడు. బండి ఎక్కడం, చేతికి వచ్చినంత ఇవ్వడం. బేరం ఎప్పుడూ లేదు. తాతయ్య ధర్మమా అని డబ్బుకు లోటు ఎన్నడూ లేదు. అరువు ఎరగను.

"బళ్ళు తోలుకుని జీవించేవారు, కాయకష్టంతో బ్రతికేవారు మనిషిని ఇష్టే పడ్తేస్తారు. మంచివాడని తోస్తే మనసు ఇస్తారు. చెడ్డకి చెడ్డే. అంతకన్న దూరంపోరు, నమ్మిన వాళ్ళకు ప్రాణం ఇస్తారు. అందుకనే మోసపోతారు. అది వేరే సంగతి.

"నిజానికి ఆ రోజుల్లో నాకు చాలా గర్వంగా ఉండేది. అన్ని ఊళ్ళల్లో బళ్ళవాళ్ళకు నేనంటే గౌరవమని, నన్ను గురించి చెప్పుకుంటూరని, నాకు బండి కట్టడానికి వాళ్ళల్లో

వాళ్ళు పోటీ పడతారని ఒకటే పొంగిపోయేవాడిని. వాళ్ళంతా ఒక విధంగా నాకు ఋణపడి ఉన్నారని భ్రమ.

"ఒకసారి ద్రాక్షారామం ఏదో పనిమీద వెళ్ళి ఊరికి తిరిగి పోతున్నాను. కోటిపల్లి దగ్గర గోదావరి దాటేసరికి చీకటి పడుతోంది. ఆవేళ నా దగ్గర డబ్బు తక్కువగా ఉంది. రూపాయి చిల్లర ఉందనుకుంటాను. అనాతవరం చేరుకుంటే అక్కడినుంచి బస్సులో కాట్రేనికోన వెళ్ళవచ్చు. అప్పటికి పల్లంకుర్రునుంచి కాట్రేనికోన, అనాతవరం, అమలాపురం మీదుగా గన్నవరానికి బస్సు పడింది.

"సాయంత్రం 7-30కి అనాతవరానికి ఆఖరి బస్సు వస్తుంది. అనాతవరంనుంచి కాట్రేనికోన పావలా అర్థణా. ఇంక నా దగ్గర ముప్పావలా పైగా ఉంటుంది. దానితో అనాతవరం చేరుకోవాలి. మామూలుగా రేవు దగ్గరినుంచి అనాతవరానికి అర్థరూపాయి, పదణాలకు బండి కట్టుతారు. సరిగా సరిపోతుందికదా అనుకున్నాను.

"పడవలోంచి దిగేసరికి బళ్ళవాళ్లు చుట్టు ముట్టారు. నాతోపాటు మరికొందరు కూడా ఉన్నారు. ఒక బండి ఆసామీ అనాతవరానికి రూపాయి పావలా ఇమ్మంటున్నాడు. రెండవ అతను బేడ తగ్గించి ఇమ్మని కేకలు వేస్తున్నాడు. మూడో బండిమనిషి "తిరుగు బండి బాబూ, పదణాలు ఇవ్వండి తీసుకు పోతాను" అన్నట్లు ఆ గాలి హోరులో వినిపించింది. మూడే బళ్ళు ఉన్నాయి. బళ్ళవాళ్ళలో నాకు తెలిసిన మనిషి ఎవరూ లేరు.

"తిరుగుబళ్ళు సాధారణంగా సగం రేటుకే కట్టుతారు.

అదీ బాగానే ఉందనుకొన్నాను. పైన రెండణాలు ఈనాము కూడా ఇవ్వచ్చు. సుఖంగా పోదామనుకున్నాను. అతని బండి ఎక్కాను. అనాతవరం చేరుకొనేసరికి 8-15 అయిఉంటుంది. బస్సుకి టైము ఉంది.

"బండి ఆసామీకి ముప్పావలా ఇచ్చాను. అతడు తెల్లముఖం వేశాడు.

" 'బాబూ, ఒకతను రూపాయి పావలా, మరొకతను రూపాయి బేడా అడిగితే ఎటూ కాకుండా ఇచ్చారండి' అన్నాడు.

" 'పదణాలేకదా అడిగావు' అన్నాను.

" 'మీ ఇష్టం అన్నానండి. బొత్తుగా తగ్గిస్తే వూరుకోలేకపోయానండి. ఇప్పుడూ మీ ఇష్టమే. పొమ్మంటే వూరికనే పోతానండి' అన్నాడు వినయంగానే.

"నాకు ముచ్చెమటలూ పోశాయి. అతని మాట నిజం కాదనుకోడానికి ఆస్కారంలేదు. బండివాళ్లు-ముఖ్యంగా మా తాలూకాలో ఒక అణా అదనంగా ఇమ్మని అడుగుతారు. కాని అబద్ధం చచ్చినా ఆడరు. గాలి హోరులో నాకు అలా వినిపించినట్లు అయిఉండాలి. అప్పుడు నా ఆలోచన ఎంతసేపూ పదణాలమీదే ఉంది.

"నాదే తప్పు. దగ్గరా డబ్బులేదు. అనాతవరం హోటేలో బల్లులేవు. తెలిసిన కిళ్ళీ దుకాణం యజమాని ఆ వేళకి వ్యాపారం కట్టిపెట్టి ఇంటికి పోయాడు.

"ఈ అవమానం ఎలా తప్పుతుందిరా దేవుడా అనుకొన్నాను.

" 'చూడు. పదణాలని వినిపించింది. నా దగ్గర డబ్బు లేదు. ఈ రాత్రికి నడవపల్లి పోవాలి. నన్ను మా వూరు తీసుకెళ్లు. తెల్లారి వెడుదువుగాని సరేనా' అన్నాను.

" 'లేదు బాబూ, ఇప్పటికే ముక్తేశ్వరం మూడు ట్రిప్పులు వేశాను. నా గుర్రం అలిసిపోయింది. విడిచిపెట్టేయండి. మీారే డబ్బు తరువాత పంపండి' అన్నా డతను.

" 'పేరేమిటి?' అనడిగాను.

" 'రామన్న, మాగాం' అని చెప్పాడు.

" 'మీా దగ్గర డబ్బు లేకపోతే ఇవి కూడా ఉంచండి. ఏకంగానే పంపండి" అని చెబుతూ డబ్బులు అక్కడ పడేసి వెళ్ళిపోయాడు రామన్న.

"ఇది మరో అవమానం. కేకలు వేశాను. వినిపించుకోకుండా బండి తోలుకుని చక్కాపోయాడు రామన్న.

"తన పేరు చెప్పాడు. నా పేరు అడగలేదు. తెలుసుకోవాలనే కోరికా చూపలేదు. డబ్బులు కావలసినా విడిచిపోయాడు కాని అవమానం చేయలేదు. లేకపోతే నా పరిస్థితి ఎలా ఉండును?

"భారం అంతా నాదే.

"రామన్నకు మర్నాడు మా వూరి బండి అతని ద్వారా రెండు రూపాయలు పంపాను. ఘనంగా ముట్ట

చెప్పాను. బాకీ తీర్చాను. ఘనత నాదే అనుకొన్నాను. తతిమ్మా అందరిలాగే రామన్నే కొంచెం నా బాకీలో ఉన్నా డనుకున్నాను. మరికొద్ది రోజులకే ఆ సంగతి మరిచిపోయాను.

"తరువాత చాలాకాలానికి కాని రామన్న మళ్ళీ తారసిల్ల లేదు.

"ఆసారి కూడా గోదావరి దాటేసరికి చీకటి పడింది. అప్పుడే వరదలు తగ్గాయి. వరదలు వచ్చినప్పుడు ముక్తేశ్వరం వంతెన దగ్గరనుంచి గోదావరివరకు లంక అంతా మునిగిపోయి రెండు తాళ్ళ నిలువున నీరు ఉంటుంది. అప్పుడు పడవలు కోటిపల్లి రేవు దగ్గరనుంచి సరాసరి ముక్తేశ్వరం వంతెన దాకా పోతాయి.

"వరద తగ్గడంతో లంక తిరిగి బయట పడుతుంది. కాని లంకలో రోడ్డు ఓ నెలరోజులపాటు అయినా బురదతో నిండి ఉంటుంది. పడవలు లంక దాకానే వెడతాయి. అక్కడి నుంచి బళ్ళు ముక్తేశ్వరం వంతెన వరకు కట్టుతారు. తిరిగి వంతెన దగ్గర వేరే బండి చేసుకొని వెళ్ళాలి. అవతలివైపు కూడా వంతెనవరకే బళ్ళు వస్తాయి.

"ఆ రోజుల్లో కొన్ని బళ్ళు లంకలోంచి ప్రయాణికు లను తీసుకొని వెళ్ళడానికే ఉంటాయి. రెండు మూడు ట్రోవలు వేసేసరికి గుర్రాలపని అయిపోతుంది.

"లంకలో ప్రయాణం ఒక వంతు. ఆ తరువాత ప్రయాణం ఒక వంతు.

"ఆ వేళ పడవలోంచి నాతోపాటు మరి ముగ్గురు దిగారు. అంతా ముక్తేశ్వరం దాటిపోవలసినవాళ్ళే.

"అవతలవైపు ఒక్కటే బండి ఉంది. అది మాగాం రామన్న బండి. అతను చీకటిలో కూడా నన్ను ఇట్టే గుర్తు పట్టాడు.

" 'రండి బాబూ, బండి ఎక్కం'డన్నాడు.

"ఎక్కాను. వంతెన దగ్గర విడిచిపెట్టాడు. చీకటిలో ఆ బురదలో ప్రయాణం ఎంత కష్టమో చెప్పలేను.

"వంతెన దగ్గరనుంచి అనాతవరానికి నాకు వేరే బండి కుదిర్చిపెట్టాడు.

" 'ఈవేళ లంకలో బండి రేటు అర్ధరూపాయి బాబూ, మీ చిత్తం' అన్నాడు.

"ఘరానాగా ముప్పావలా ఇచ్చాను. సంతోషంతో తీసుకుని వెళ్ళిపోయాడు.

"అనాతవరం బండి అతను ఇదంతా చూస్తూనే ఉన్నాడు. దారిలో నన్ను కదలేశాడు.

"ఏమీ తెలియనట్లు 'రామన్నకి ఎంతిచ్చారండి' అన్నాడు. చెప్పాను.

" 'రామన్న మీకు తెలుసాండి' అనడిగాడు.

" 'ఒకసారి అతని బండి ఎక్కా'నని చెప్పాను.

" 'చిత్రంగా ఉందండి. ఈ వేళ లంకలో రేటు రెండు రూపాయలండి. నలుగుర్ని వేసుకుంటే మనిషికి అర్ధరూపాయి

వసూలు చేస్తున్నారు. రెండు త్రోవలువేస్తే నాలుగు రూపాయలు కళ్ళ చూడొచ్చు' అన్నాడతను.

"మాగాం రామన్న నా బాకీ తీర్చేశాడు.

"నాకు మళ్ళీ రామన్న ఎప్పుడూ తటస్థపడలేదు. నేను మరికొలది రోజులకే జైల్లాం విడిచిపోయాను.

"రామన్న ఋణం తీర్చుకునే ఉపాయం ఏముంది?" నరసింహం ముగించాడు.

"తీర్చివేస్తే ఋణం ఉండదు. చెప్పడానికీ ఉండదు. ఏమంటార్రా" అని నవ్వాడు మా రామం.

మేము నవ్వలేదు.

---